ప్రజాశక్తి

బుధవారం 17 సెప్టెంబరు 2025

5

శ్రీకాకుళం

యూరియా సరఫరాలో ప్రభుత్వం విఫలం

కొత్తూరు : ఖరీఫ్ సీజన్‌లో రైతులకు సకాలంలో యూరియాను అందించడంలో టిడిపి కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని వైసిపి రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఒక ప్రకటనలో విమర్శించారు. కొన్ని ప్రాంతాల్లో యూరియాను బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయిస్తున్నారని తెలిపారు. దీనివల్ల చిన్న, సన్నకారు రైతులు తీవ్ర ఆర్థిక భారాన్ని మోయాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి అవసరమైన యూరియా కోటాను తెప్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని పేర్కొన్నారు. రైతులు యూరియా కోసం పడిగాపులు కాస్తున్నారని, గంటల తరబడి బారులు తీరాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. బ్లాక్ మార్కెట్ దందా పెరిగిపోవడంతో రైతులు నిస్సహాయంగా మిగిలిపోయారని పేర్కొన్నారు.

యూరియా... ఏదయా..?

- అన్నదాతలను వీడని యూరియా కష్టాలు
- పంపిణీ కేంద్రాలు, ప్రైవేట్ దుకాణాల వద్ద పడిగాపులు
- జిల్లాకు మరో ఆరు వేల ఎకరాలు అవసరమని గుర్తింపు
- ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి

జిల్లాలో అన్నదాతలను యూరియా కష్టాలు వీడడం లేదు. యూరియా కోసం నెల రోజులుగా వారు అవస్థలు పడుతూనే ఉన్నారు. కేంద్రం నుంచి వస్తోంది, అదిగో ఇదిగో అని ప్రభుత్వం లెక్కలు చెప్తున్నా... అన్నదాతలకు మాత్రం అవి చేరడం లేదు. కనీసం ప్రైవేట్ దుకాణాల్లో కొనుగోలు చేద్దామన్నా దొరికే పరిస్థితి కనిపించడం లేదు. ఆగస్టు, సెప్టెంబరులో జిల్లాకు పంపాల్సిన యూరియా కోటాలో కోత విధించడం కొరతకు ప్రధాన కారణమన్న అభిప్రాయం వినిపిస్తోంది. మరోవైపు ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందు, జూన్‌లో జిల్లాకు యూరియా నిల్వలు వచ్చినా, అవి పక్కదారి పట్టడంతో తీవ్ర కొరతకు దారితీసిందన్న చర్చ నడుస్తోంది. ఇప్పటికీ జిల్లాకు ఆరు వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని అధికారులు అడుగుతున్నా, అవి ఎప్పట్లోగా వస్తాయో తెలియని పరిస్థితి నెలకొంది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

యూరియా కోసం బారులు తీరిన రైతులు (ఫైల్)

ఖరీఫ్ మొత్తానికి 42,225 మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని అధికారులు ప్రతిపాదనలు పంపారు. ప్రభుత్వం అందులో కోత పెట్టి జిల్లాకు 21,840 మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేసింది. ఆ తర్వాత కొసిరి కొసిరి రెండు విడతల్లో సుమారు మరో మూడు వేల మెట్రిక్ టన్నులను పంపింది. ఆగస్టు చివరి వారంలో యూరియా కొరత సమస్య తలెత్తినా, జిల్లాలో అటువంటిదేమీ లేదని ప్రభుత్వం అధికారులతో ప్రకటనలు ఇప్పించింది. జిల్లాలో ఎరువుల పరిస్థితిపై గణాంకాలతో సహా ప్రకటనలను వెలువరించింది. వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కూడా యూరియా కొరత లేదనే చెప్పుకొచ్చారు. ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో చాలాచోట్ల వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో యూరియా, డిఎపి వంటి ఎరువులను వినియోగించలేకపోయారు. ఆగస్టు చివరి వారంలో అల్పపీడన ప్రభావంతో వర్షాలు కురవడంతో యూరియాకు అధిక డిమాండ్ ఏర్పడింది.

అదీగాక కొన్నిచోట్ల పంట పొలాలు నీట మునగడంతో నారు బతికించుకోవడానికి రైతులకు యూరియా అవసరం బాగా ఏర్పడింది. దీంతో యూరియా కోసం రైతులు రోడెక్కిన పరిస్థితి వచ్చింది. దీంతో అప్పటివరకు కొరత లేదంటూ చెప్పుకొచ్చిన వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, వ్యవసాయశాఖ కమిషనర్‌తో మాట్లాడి కేంద్రం నుంచి తెప్పించినట్లుగా ప్రకటనలు ఇచ్చారు. యూరియాపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్ష సమయంలోనే కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ స్పందించి రాష్ట్రానికి యూరియా పంపేశారంటూ ప్రచారం చేశారు. కానీ గ్రామాల్లో యూరియా దక్కక రైతులు అవే అవస్థలు పడుతున్నారు.

నెలవారీ కోటాలో కోతలు

జిల్లాకు ఇప్పటివరకు 26,264 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చింది. ఇంకా జిల్లాకు ఆరు వేల మెట్రిక్ టన్నులు అవసరమని అధికారులు భావిస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి నెలవారీ కోటాను ప్రభుత్వం సరిగా పంపకపోవడంతో, యూరియా కొరత అంతకంతకూ తీవ్రతరమైంది. జూలై కోటా కింద విడుదల కావాల్సిన 9,600 మెట్రిక్ టన్నుల యూరియాలో నాలుగు వేల టన్నులు మాత్రమే వచ్చాయి. ఆగస్టుకు సంబంధించి ప్రభుత్వం తొమ్మిది వేల మెట్రిక్ టన్నులను సరఫరా చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు 4,500 మెట్రిక్ టన్నులు పంపింది. సెప్టెంబర్‌కు నెల కోటా కింద పది వేల మెట్రిక్ టన్నులు సరఫరా చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు 4,400 మెట్రిక్ టన్నులు మాత్రమే జిల్లాకు చేరింది.

పక్కదారి పట్టిన యూరియా!

యూరియాకు విపరీతమైన డిమాండ్ నెలకొనడంతో, దాన్ని సొమ్ము చేసుకునేందుకు కొంతమంది ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. గ్రామస్థాయి సిబ్బంది కొంతమంది ఈ పనికి పాల్పడుతున్నట్లు సమాచారం. యూరియా కావాల్సిన రైతులకు వాటిని రూ.200 నుంచి రూ.300 వరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నట్లు తెలిసింది. పాతపట్నం మండలం తెంబూరులో ఈనెల 14న గ్రామ సచివాలయం నుంచి అర్ధరాత్రి సమయంలో బైక్‌పై ఓ వ్యక్తి రెండు బస్తాల యూరియాను తరలిస్తుండగా, గ్రామస్తులు పట్టుకుని అధికారులకు అప్పగించారు. సచివాలయ ఉద్యోగే తాళాలు తీసి యూరియా బస్తాలు ఇచ్చారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన తర్వాత పంపిణీ కేంద్రాలకు వచ్చిన ఎరువులను ఆర్ఎస్‌కె సిబ్బంది ఎటువంటి వేలిముద్రలు వేయకుండానే పంపిణీ చేశారు. ఆర్ఎస్‌కెలు, పిఎసిఎస్ వంటి ప్రభుత్వ పంపిణీ కేంద్రాల్లో చాలాచోట్ల ఈ-పోస్ యంత్రాలు లేకపోవడంతో రైతుల పేర్లు, ఆధార్ నంబర్లు రాసుకుని ఎరువులు అందించారు. దీంతో సిఫార్సులు, గ్రామాల్లో పలుకుబడి ఉన్న నాయకులు చెప్పినట్టుగానే సిబ్బంది ఎరువులు పంపిణీ జరిగిపోయింది.గ్రామానికి వచ్చిన యూరియాను టిడిపి నాయకులే తీసుకువెళ్లిపోయారని ఒకపక్క రైతులు, అమ్ముకున్నారని వైసిపి నాయకులు విమర్శిస్తున్న నేపథ్యంలో అధికారులు విచారణ చేపడితే వాస్తవాలు తెలిసేవన్న అభిప్రాయం వినిపిస్తోంది.

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న హమాలీల కుటుంబసభ్యులు

దళిత కార్మికుల పొట్ట కొట్టొద్దు

- టెక్కలిలో కొత్త ఐఎంఎల్ డిపోను రద్దు చేయాలి
- సిఐటియు డిమాండ్
- కలెక్టరేట్ వద్ద కుటుంబసభ్యులతో కలిసి హమాలీల ధర్నా

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

రాష్ట్ర ప్రభుత్వం టెక్కలిలో కొత్త ఐఎంఎల్ డిపో ఏర్పాటును రద్దు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపోకు భూములు ఇచ్చిన దళిత కార్మికుల పొట్ట కొట్టొద్దన్నారు. ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపోను విడదీసి, టెక్కలిలో మరో మద్యం డిపో ఏర్పాటుకు ఇచ్చిన ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలని, కార్మికుల ఉపాధిని కాపాడాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపో కార్మికులు కుటుంబ సభ్యులతో కలిసి నగరంలోని ఆర్అండ్‌బి బంగ్లా నుంచి ప్రదర్శనగా కలెక్టరేట్‌కు చేరుకుని కుటుంబ సభ్యులతో మంగళవారం ధర్నా నిర్వహించారు. ధర్నాకు సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు మద్దతు తెలిపారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐఎంఎల్ డిపో కార్మికులు టెక్కలిలో కొత్త డిపో ఏర్పాటు రద్దు చేయాలని పలురూపాల్లో ఆందోళన కార్యక్రమాలు చేస్తున్నా, ప్రభుత్వం స్పందించకపోవడం అన్యాయమన్నారు. ఎచ్చెర్లలో దళిత కుటుంబాల నుంచి జాతీయ రహదారి పక్కన కోట్లాది రూపాయల విలువ చేసే నాలుగు ఎకరాల భూమిని ఎటువంటి నష్టపరిహారం ఇవ్వకుండా ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుని ఎచ్చెర్లలో బాటిలింగ్ యూనిట్ ఏర్పాటు చేసిందన్నారు. ప్రభుత్వం భూములు ఇచ్చిన దళిత కుటుంబాలకు చెందిన కార్మికులుగా, హమాలీలుగా 80 మంది లోడింగ్, అన్ లోడింగ్ పనులు పనిచేస్తూ రోజువారీ వచ్చే ఆదాయం పైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నాయన్నారు.

ఉమ్మడి జిల్లాలో ఒక డిపో ద్వారా కొనసాగుతున్న దాన్ని నేడు జిల్లా నుంచి ఎనిమిది మండలాలు పక్క జిల్లాలకు వెళ్లినా, డిపో విడగొట్టి ఇప్పుడు కొత్తగా టెక్కలిలో మరో డిపో ఏర్పాటు చేయాల్సిన అవసరం ఏమొచ్చిందో వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రజలు మంత్రికి పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసి నీరు అడుగుతున్నారు తప్ప బీరు అడగడం లేదన్నారు. ఎచ్చెర్లలో ప్రభుత్వ సొంత గోడౌన్ ద్వారా మద్యం సరఫరా చేస్తుంటే, అదనంగా టెక్కలిలో మరో ప్రైవేట్ గోడౌన్ అద్దెకు తీసుకొని ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం జూలై ఎనిమిదో తేదీన ఉత్తర్వులు జారీ చేయడం అన్యాయమని విమర్శించారు. దీనివల్ల టెక్కలిలో గొడౌన్‌కు ప్రభుత్వం అద్దె చెల్లించాలని, అదనపు సిబ్బందిని నియమించాలని, నెలకు లక్షలాది రూపాయలు ప్రభుత్వంపై అదనపు భారం పడుతుందన్నారు. మరోవైపు ఎచ్చెర్ల డిపో పైనే ఆధారపడిన ఉపాధి పొందుతున్న 80 దళిత, పేద కుటుంబాలకు చెందిన హమాలీలకు తగినంత ఆదాయం లేక కార్మికుల కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపోను విడదీసి టెక్కలి మండలం తిర్లంగిలో అదనంగా మరో మద్యం డిపో ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులు వెంటనే రద్దు చేసి ఎచ్చెర్ల డిపోను యథావిధిగా కొనసాగించాలని కోరారు. దళితులు, పేదలుగా ఉన్న హమాలీల ఉపాధిని కాపాడే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. ధర్నాలో ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపో హమాలీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి డి.బంగారురాజు, నాయకులు టి.రామారావు, ఎన్.సురేష్, ఎన్.రమణ, బోనెల.రాము, పి.రామారావు, కుటుంబసభ్యులు బి.రామలక్ష్మి, ఎల్.పద్మ, డి.మాధవి, బి.రాజులు, ఎస్.రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న బిఆర్ఎయు విసి రజని

విద్యార్థుల భవితకు పాఠ్యాంశాల్లో మార్పులు

బిఆర్ఎయు వైస్ ఛాన్సలర్ కె.ఆర్ రజని

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

విద్యార్థులకు కెరీర్ పరంగా ఉజ్వల భవిష్యత్ అందేలా డిగ్రీ కోర్సుల పాఠ్యాంశాల్లో మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ కె.ఆర్ రజని సూచించారు. బిఆర్ఎయు అనుబంధ డిగ్రీ కళాశాలలకు చెందిన యుజి కోర్సుల బోర్డు ఆఫ్ స్టడీస్ సమావేశాన్ని బిఆర్ఎయు క్యాంపస్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ విద్యా విధానం ప్రకారం డిగ్రీ స్థాయి అభ్యసన అంశాల్లో ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్ సబ్జెక్టు తప్పనిసరిగా బోధించాలనే నిబంధన ఉందన్నారు. క్వాంటమ్ సంబంధిత అంశాలనూ ఈ విద్యా సంవత్సరం నుంచి బోధన అంశాల్లో ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. సభాధ్యక్షులు, వర్శిటీ అకడమిక్ అఫైర్స్ డీన్ కె.స్వప్నవాహిని మాట్లాడుతూ ఎఐ, మెషిన్ మెర్నింగ్, కమ్యూనిటీ సర్వీసెస్, ఎన్విరాన్‌మెంట్ స్టడీస్ వంటి అంశాలు డిగ్రీ సబ్జెక్టుల్లో తప్పనిసరిగా ఉండేలా సిలబస్‌ల్లో ప్రతిపాదనలు రూపొందించుకోవాలని సూచించారు. రిజిస్ట్రార్ బి.అడ్డయ్య మాట్లాడుతూ క్వాంటమ్ టెక్నాలజీపై బెంగళూరు యూనివర్శిటీ నిర్వహించే ఫ్యాకల్టీ ఇంప్రూమెంట్ ప్రోగ్రాంకు డిగ్రీ కళాశాలల అధ్యాపకులు హాజరు కావాలని సూచించారు. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి కూడా ఈమేరకు ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. వర్శిటీ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్, సిడిసి డీన్ ఎస్.ఉదయ భాస్కర్ మాట్లాడుతూ అపార్ ఐడి సమస్యలు లేకుండా ఆయా డిగ్రీ కళాశాలలు చర్యలు తీసుకోవాలని కోరారు. వర్శిటీ యుజి పరీక్షల డీన్ జి.పద్మారావు, అసిస్టెంట్ డీన్ కె.ఉదయ కిరణ్ మాట్లాడారు. సమావేశంలో వర్శిటీ పూర్వ రిజిస్ట్రార్ టి.కామరాజు, ఎస్ఒ కె.సామ్రాజ్యలక్ష్మి, 14 బోర్డుల యుజి ఛైర్మన్లు, సభ్యులు పాల్గొన్నారు.

చంద్రబాబు ఒక్క మెడికల్ కాలేజ్ తెచ్చారని..

నిరూపిస్తే రాజకీయ సన్యాసం

మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

నాలుగుసార్లు ముఖ్యమంత్రిగా వ్యవహరించిన చంద్రబాబు నాయుడు తన హయాంలో ఒక్క మెడికల్ కళాశాల తీసుకొచ్చారని నిరూపిస్తే, తాను రాజకీయాల నుంచి తప్పుకుంటానని మాజీ మంత్రి, వైసిపి వైద్య విభాగం రాష్ట్ర అధ్యక్షులు సీదిరి అప్పలరాజు సవాల్ చేశారు. నగరంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన పాడేరు మెడికల్ కాలేజ్ సైతం తాము తెచ్చామని చెప్పడం అన్యాయమన్నారు. పేద విద్యార్థులంటే ఆయనకు ప్రేమ లేదన్నారు. స్వాతంత్ర్యానికి ముందు ప్రారంభమైనవి సైతం తానే తెచ్చినట్లు చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి సిఎంగా ఉన్న సమయంలో శ్రీకాకుళం, ఒంగోలు, కడప, తెలంగాణలో రిమ్స్‌లు ప్రారంభమయ్యాయని తెలిపారు. చంద్రబాబు వల్ల 17 మెడికల్ కళాశాలలు వచ్చాయని తప్పుడు ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. పిపిపి మోడల్ పేరుతో ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేట్‌కు అప్పగిస్తున్నారని విమర్శించారు. ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో 50 శాతం సెల్ఫ్ ఫైనాన్స్ సీట్లు పెడితే విమర్శించారని, ప్రస్తుతం వైద్య విద్యను ప్రైవేటీకరణ చేస్తున్నారని చెప్పారు. టీచింగ్ హాస్పిటల్స్, ఆరోగ్యశ్రీ సైతం ప్రైవేట్‌కు అప్పగిస్తున్నారని తెలిపారు. పేద ప్రజలకు వైద్యం, వైద్య విద్యను దూరం చేస్తున్నారని విమర్శించారు. ప్రైవేట్ మెడికల్ కాలేజ్‌లో కన్వీనర్ కోటాలో సీట్లు పొందిన విద్యార్థులతో అడ్మిషన్, కాలేజ్ వంటి ఇతర ఫీజులు వసూళ్లు చేస్తున్నాయన్నారు. రూ.400 కోట్లతో మెడికల్ కాలేజ్ పెట్టలేరని, యోగా డేకి మాత్రం రూ.400 కోట్లు ఖర్చు చేశారని విమర్శించారు. తాత్కాలిక సెక్రటేరియట్ పేరుతో రూ.వెయ్యి కోట్లు ఖర్చు చేశారన్నారు. రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుందన్నారు. 15 నెలల్లో రూ.రెండు లక్షల కోట్లు దాటి కూటమి ప్రభుత్వం అప్పులు చేసిందన్నారు. యూరియా సైతం అందించలేకపోతున్నారని విమర్శించారు. పంటలకు మద్దతు ధర అమలు కావడం లేదన్నారు. పంటల బీమా ఎత్తేశారని, డ్రోన్ టెక్నాలజీ అంటూ ప్రచారం చేస్తున్నారని చెప్పారు. ఆరోగ్యశ్రీ రూ.మూడు వేల కోట్ల బకాయిలు పేరుకుపోయాయన్నారు. ప్రభుత్వ సంస్థలను నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు.

మాట్లాడుతున్న సీదిరి అప్పలరాజు

22న ప్రైవేట్ డిగ్రీ కళాశాలల బంద్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 22వ తేదీన ప్రైవేట్ డిగ్రీ కళాశాలల బంద్ చేపట్టనున్నట్లు ఎపి ప్రైవేట్ డిగ్రీ కాలేజ్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షులు పొన్నాన జయరాం, ప్రాంతీయ కోఆర్డినేటర్ కోత మురళీధర్ తెలిపారు. ఈమేరకు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ బిడ్డిక అడ్డయ్యకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులో తీవ్ర జాప్యం చేస్తోందన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న ప్రైవేట్ డిగ్రీ కాలేజ్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ప్రతినిధులు

ఏడాదికి నాలుగు విడతల్లో ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లిస్తుందని, గతేడాది నాలుగు విడతల్లో ఒక్క విడత మాత్రమే చెల్లించిందని చెప్పారు. ఇంకా మూడు విడతలు చెల్లించాల్సి ఉందన్నారు. ఈ ఏడాది మొదటి విడత చెల్లించలేదని విమర్శించారు. కళాశాలలు మూతపడే స్థితికి చేరుకున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రూ.600 కోట్లు దాటి బకాయిలు ఉన్నాయన్నారు. విద్యా సంవత్సరం ఆఖరు నాటికి ఫీజులు చెల్లించకపోతే డిగ్రీలు తీసుకుని వెళ్లే విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. కళాశాలలు సక్రమంగా నిర్వహించాలంటే, కచ్చితంగా విద్యా సంవత్సరం చివరి నాటికి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇలాగే కొనసాగితే భవిష్యత్‌లో ఉన్నత విద్య మూత పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో యూనియన్ ప్రతినిధులు మొదలవలస మోహనరావు, చిట్టిబాబు, శ్రీనివాసరావు, విజయ్ తదితరులున్నారు.

23 నుంచి కొత్తమ్మతల్లి శతాబ్ది ఉత్సవాలు

టెక్కలి ఆర్‌డిఒ కృష్ణమూర్తి

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

ఈనెల 23 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించనున్న కొత్తమ్మతల్లి దేవస్థానం శతాబ్ది ఉత్సవాలను సమన్వయంతో విజయవంతం చేయాలని టెక్కలి ఆర్‌డిఒ కృష్ణమూర్తి కోరారు. ఉత్సవాల ఏర్పాట్లపై మండల కేంద్రంలోని అమ్మవారి ఆలయంలో అధికారులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేసేందుకు అందరూ సహాయ సహకారాలు అందించాలని కోరారు. రాష్ట్రస్థాయిలో మహిళలు, పురుషులకు కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నామని, బృందాలను ఆహ్వానించినట్లు వివరించారు. కబడ్డీతో పాటు గ్రామీణ క్రీడలు నిర్వహిస్తామన్నారు. హెలీ రైడింగ్‌కు సంబంధించి టికెట్ ధర ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ఏర్పాటు చేస్తామన్నారు. 24వ తేదీ సాయంత్రం కొత్తపేట జంక్షన్ నుంచి శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మూడు రోజులూ సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నదానం ఉంటాయన్నారు. దర్శనానికి వచ్చే యాత్రికులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.

అమ్మవారి ప్రమోషనల్ వీడియో కోసం వీడియో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అమ్మవారి విశిష్టతపై 24వ తేదీన లేజర్ షో ఉంటుందన్నారు. అనంతరం ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో శ్రీకాకుళం, పలాస ఆర్‌డిఒలు కె.సాయి ప్రత్యూష, వెంకటేష్, సుడా ఇఇ సుగుణాకరరావు, జిల్లా వ్యవసాయ అధికారి త్రినాథస్వామి, డిఆర్‌డిఎ, డ్వామా పీడీలు కిరణ్ కుమార్, సుధాకర్, అరసవల్లి ఆలయ డిప్యూటీ కమిషనర్ వరప్రసాద్, ఎసి ప్రసాద్, కొత్తమ్మతల్లి ఆలయ ఇఒ వి.రాధాకృష్ణ, తహశీల్దార్ అప్పలరాజు, ఎంపిడిఒ ఫణీంద్ర కుమార్, ఆలయ కమిటీ అధ్యక్షులు కె.చిన్నగోవింద్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

కనీస వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లో పనిచేస్తున్న కెప్టెన్స్ (డ్రైవర్లు) కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.బసవరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.దేవీప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎపి తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) కెప్టెన్స్‌కు స్థానిక సిఐటియు కార్యాలయంలో మంగళవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలతో మారుమూల ప్రాంతాల్లో సమయంతో నిమిత్తం లేకుండా సేవలందిస్తున్నామని, సేవలను ప్రభుత్వాలు గుర్తించడంలో విఫలమవుతున్నాయని విమర్శించారు. అరబిందో యాజమాన్యం పదేళ్లుగా అతి తక్కువ వేతనం ఇస్తున్నాయని, ఆ వేతనంతో పెరిగిన నిత్యావసరాల ధరలతో జీవనం సాగించడం దుర్భరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. యాజమాన్యం వాటా పిఎఫ్, ఇఎస్ఐను యాజమాన్యమే చెల్లించాలని డిమాండ్ చేశారు. చట్టప్రకారం వీక్లీ ఆఫ్, జాతీయ సెలవులు అమలు చేయాలన్నారు. విధి నిర్వహణకు అవసరమైన సెల్‌ఫోన్ ఇస్తూ, నెలవారీ రీఛార్జి చేయాలని కోరారు. ప్రమాద బీమా, ఎక్స్‌గ్రేషియా, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. వాహనాల మరమ్మతులు చేయాలని, రిపేర్లకు అయ్యే సొమ్ముని ముందుగా చెల్లించాలని కోరారు. వాహనాల సంఖ్యను బట్టి అదనపు, బఫర్ సిబ్బందిని నియమించాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు టౌన్ కన్వీనర్ ఆర్.ప్రకాశరావు, ఎపి తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎం.దశరథరావు, కోశాధికారులు ఎం.మణికంఠ, ఎల్.రాంబాబు, కె.రాజేశ్వరరావు, కె.కృష్ణంనాయుడు, పి.వెంకటరావు, పి.అనంత్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతన్న బసవరాజు

IN THE HONOURABLE COURT OF 3rd ADDITIONAL DISTRICT JUDGE CUM MACT AT SRIKAKULAM (FAMILY COURT) I.A 649/2025 in M.V.O.P. 377/2019

Between:-
Paidi@ Pydi Aruna Kumari & 3 Others
----Petitioners.
And:-
Peddinti Venkata Naidu & Others
----Respondents

NOTICE TO:

R-5: Andhavarapu Lavanya, D/o Kondalarao @ Kondababu, R/o 8th Line, PN. Colony, Gujarathipeta, Srikakulam Town & Dist.
R-6: Andhavarapu Jagan @ Ayyappa, S/o Kondalarao @ Kondababu, --rest do--.
R-7: Andhavarapu Neelima, D/o Kondalarao @ Kondababu, --rest do.---

పై నంబర్ పిటిషన్‌లో Respondent No2 అయిన అందవరపు భారతి మరణించినందున తన వారసులకి నోటీస్ నిమిత్తం ఉన్నందున **తేదీ 23-09-2025 న ఉదయం: గం॥ 10-30 ని॥** లకుగాను పై కోర్టు వారి ఎదుట స్వయంగా కానీ, ప్లీడరు గారి ద్వారా కానీ హాజరై మీ వాదనలు తెలియజేసుకొనవలెను. లేనిచో మీ పరోక్షమునందు గౌరవ కోర్టు వారు విచారణ జరిపి తగు ఆర్డర్ జారీచేయగలరు అని తెలియజేయడమైనది.

సి.హెచ్. తిరుపతిస్వామి
న్యాయవాది, శ్రీకాకుళం,సెల్: 9441012425.

IN THE HONORABLE COURT OF SENIOR CIVIL JUDGE, AT SRIKAKULAM. I.P. 24/2025

Between:-
Kola Janardhanarao. .....Petitioner.
And:-
1) Narayanamsetti Srinu @ Iron shop Srinu.
2) Podilapu Ramarao.
3) Mahadasi Srinu.
4) Mindana Ramarao.
5) Sondu Sudha.
6) Kovvuru Satish Reddi.
7) Govindadas Sai
8) Gudla Venkatarao
9) Dasari Balaram.
10) Pydi Balakrishna.
11) Gorle Varam.
12) Kola Sanyasirao.
13) Konisetti Adibabu.
14) Kola Balaji.
15) Kola Raju.
16) G.J.R. Gandreddy,
17) Teetra Ramana.
18) Pasapu Venkatarao......Respondents.

Notice to General Public.

Please take notice that Kola Janardhanarao, S/o Ramarao of Seethamvalasa village. Ranasthalam Mandalam, Srikakulam District, filed the above Insolvency petition against respondents to declare him as insolvent. Anybody have any objections relating to the above said petition you are hereby required to be attend on **24.9.2025 at 10.30 A.M.** before the above said Honorable court court, and submit your objections if any, Failing which the matter will be determined in your absence.

J. BHEEMASENA RAO,
ADVOCATE, VIZIANAGARAM.
K. SURESH,
ADVOCATES FOR PETITIONERS.
SRIKAKULAM

కలపను తరలిస్తున్న అక్రమార్కులు

యథేచ్ఛగా కలప అక్రమ రవాణా

ప్రజాశక్తి- లావేరు

మండలంలో టేకు అకేసా కలప అక్రమ రవాణా ఆగడం లేదు. నీలగిరి కర్ర మాటున ఇతర రాష్ట్రాలకు అక్రమంగా కలప రవాణా అవుతుంది. 'ప్రజాశక్తి'లో పలుమార్లు కలప అక్రమ రవాణాపై కథనాలు వెలువడడంతో డిఎఫ్ఒ సునీల్, రెంజర్ శ్రీనివాసరావు, విశాఖపట్నం నుంచి ఫ్లయింగ్ స్వడ్ బృందం స్పందించింది. సోమవారం బొంతుపేట వద్ద ఉన్న కనకమహాలక్ష్మి శివజ్యోతి వేబ్రిడ్జిలు వద్ద అకేస కర్రలు లోడులను పట్టుకున్నారు. ఒక వేబ్రిడ్జికి రూ.60 వేలు, మరో వేబ్రిడ్జికి రూ.40 వేలు జరిమానా విధించి కేసు చేశారు. అయినా మంగళవారం కలప అక్రమ రవాణా ఆగలేదు. సభుద్రాపురం వేదమాత లేఅవుట్‌లో చెట్లు మాటున రహస్య ప్రదేశంలో అకేసా టెక్ కర్రలు లోడింగ్ యథేచ్ఛగా జరుగుతుంది. రోజూ ఇక్కడ నుంచి వందలు టన్నుల విలువైన కలప అక్రమంగా రవాణా అవుతుంది. ఇందులో అటవీశాఖ సిబ్బంది ప్రమేయం లేకుండా ఇంతటి భారీ స్థాయిలో రూ. కోట్లు విలువ చేసే కలప రాష్ట్రాలు దాటి వెళ్లిపోతున్నాయి. అటవీశాఖ అధికారులు పట్టించుకోకపోవడంపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ దందా మొత్తం బొంతుపేట వద్ద ఉన్న వేబ్రిడ్జిల యాజమాన్యాల కనుసన్నల్లోనే అవుతుందని చర్చ సాగుతోంది. అటవీశాఖ ఉన్నతాధికారులు అత్యంత విలువైన టెక్ అకేస కలప అక్రమ రవాణాపై ఉక్కుపాదంతో అణచివేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

క్యూలో ఉన్న రైతులు

యూరియా కోసం అగచాట్లు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

వరి నాట్లు నాటి సుమారు రెండు నెలలు కావస్తున్నా చాలా వరకు యూరియా లభ్యం కాక రైతులు అగచాట్లు పడుతున్నారు. మండలంలోని పూండిలోని ప్రైవేటు ఎరువులు దుకాణం వద్ద రైతులు గంటల తరబడి నిలబడ్డారు. సుమారు పది కిలోమీటర్ల దూరంలో ఉన్న మహదేవిపురం నుంచి రైతులు తరలివచ్చారు. వ్యవసాయ అధికారులు టోకెన్లు ఇస్తుంటే వాటిని పట్టుకొని వస్తున్నారు. యూరియా బస్తాలు ఇంటికి తీసుకెళ్లడానికి అదనంగా రూ.50 ఖర్చు అవుతుందని రైతులు వాపోతున్నారు. వ్యవసాయ భూమి లేని వారుకూడా తమ పలుకుబడి ఉపయోగించి టోకెన్ తెచ్చుకుని యూరియా తీసుకెళ్లి అధిక ధరకు విక్రయిస్తున్నారని రైతులు గుసగుసలాడుకుంటున్నారు. నల్ల బజారులో రూ.700 నుంచి రూ.800 వరకు యూరియా విక్రయిస్తున్నారని అటువంటి వారిపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ఈ సమయంలో చిన్నచిన్న సమస్యలు తలెత్తడంతో తహశీల్దార్ సీతారామయ్య, ఎస్ఐ నిహార్ రైతులకు సర్ధిచెప్పి సజావుగా యూరియా పంపిణీ చేపట్టారు.

పర్యావరణ పరిరక్షణతోనే మనుగడ

ఆమదాలవలస : మాట్లాడుతున్న రవికుమార్

ప్రజాశక్తి- ఆమదాలవలస

పర్యావరణ పరిరక్షణతోనే జీవరాసుల మనుగడ సాధ్యమని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు, జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులు పైల రవికుమార్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఓజోన్ పరిరక్షణ దినాన్ని ఘనంగా నిర్వహించారు. ఓజోన్ పొర వినాశనానికి గల కారణాలు దానిని రక్షించుకోవలసిన ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. జన విజ్ఞాన వేదిక ఎడ్యుకేషనల్ సబ్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ గొంటి గిరిధర్ మాట్లాడుతూ కాలుష్యకారక వాయువులు, క్లోరోఫ్లోరో కార్బన్లను నియంత్రించడం, పర్యావరణ పరిరక్షణ నిధులు పెంపు, ప్రజల్లో పర్యావరణ స్పృహ కలిగించడం ద్వారానే జీవరాసుల మనుగడ సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.ఎ.రాములు, జన విజ్ఞాన వేదిక నాయకులు కోట ఈశ్వరరావు, పి.మోహనరావు, షేక్ షావలి, జి.అప్పారావు, పి.రామస్వామి నాయుడు, టిసి హెచ్.మనోహర్, జి.కుమారి, ఎస్.అరుణ, ఎస్.సులోచనారాణి, ఎం.వి.ఆర్.బట్లు, ఎం.ఉమాకుమారి, సిహెచ్.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధిలోని పురుషోత్తపురం జిల్లా పరిషత్, కొలిగాం జెడ్‌పి పాఠశాలల్లో ప్రపంచ ఓజోన్ పరిరక్షణపై హెచ్‌ఎం వెంకటరమణ, హెచ్‌ఎం ప్రమీలకుమారి అవగాహన కల్పించారు. విద్యార్థులు గొడుగులు కప్పుకుని వలయాకారంలో కూర్చున్నారు. గొడుగుకు రంధ్రం పడితే మనిషి ఎలాగైతే రక్షణ పొందలేడో... అలాగే ఓజోన్ పొరకు రంధ్రం ఏర్పడితే మానవ మనుగడకు రక్షణ ఉండదని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరేంద్ర నాథ్ పట్నాయక్, జ్యోతి, నిలీప్, పాపారావు, శ్రీనివాస్, భాస్కర్‌రెడ్డి, ధర్మరాజు, రామ్మోహనరావు, అమిత, రేణుక, దేవకి, చంద్రవదన ఉప్పాడ పాపారావు, అమిత, కోటేశ్వరరావు, బర్ష ప్రధాన్ పాల్గొన్నారు.

లావేరు : మండలంలోని బుడుమూరు ఉన్నత పాఠశాలలో మంగళవారం ప్రపంచ ఓజోన్ దినోత్సవాన్ని వినూత్నంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఓజోన్ అణువు 3 ఆకారంలో కూర్చొని అవగాహన కలిపించారు. ఓజోన్ పరిరక్షణకు విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రతిజ్ఞ చేశారు. ఓజోన్ పొర, భూమికి రక్షా కవచం అని, దానిని రక్షించుకోవాలని ఎపిఎన్‌జిసి జిల్లా కో-ఆర్డినేటర్ పూజారి గోవిందరావు కోరారు. మొక్కలు నాటి, పచ్చదనం పెంచాలని ప్రధానోపాధ్యాయులు రువ్వ పూర్ణచంద్రరావు కోరారు. తరువాత నినాదాలు చేస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్.కె.ప్రసాద్, ఎం.అనురాధ, కొండేటి వెంకటరావు, పడాల తమ్మినాయుడు, కూన చినపెంటయ్య, సీర రమేష్‌బాబు, ఇమ్రాన్ బేగ్, లంక రమణమ్మ పాల్గొన్నారు.

బూర్జ: కాలుష్యంతో మానవాళి మనుగడకు ముప్పు వాటిల్లుతుందని ఆర్ష్వ సంస్థ డైరెక్టర్ నూక సన్యాసిరావు అన్నారు. ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవ సందర్భంగా సమావేశం నిర్వహించారు. సూర్యకిరణాలు ద్వారా అతి నీలోహిత యువి కిరణాల నేరుగా భూమి మీద పడకుండా రక్షించే పొరను రక్షించే పర్యావరణం కాలుష్యం వాడకాలు తగ్గిందన్నారు.

సంతబొమ్మాళి : మండలంలోని కొల్లిపాడు జెడ్‌పి ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం మెట్ట రామారావు ఆధ్వర్యాన ఓజోన్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు పిలక ధనుంజయకుమార్, పి.సత్యనారాయణ పాల్గొన్నారు.

కొత్తూరు : కుంటిభద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బి.వి.రమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నందిగాం : పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు విద్యార్థి దశ నుంచే అవగాహన కలిగి ఉండాలని లకిదాసుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

సోంపేట : చిత్రలేఖనాన్ని పరిశీలిస్తున్న విద్యార్థులు

ఇచ్ఛాపురం : ఓజోన్ పొర మాదిరిగా కూర్చున్న విద్యార్థులు

ప్రధానోపాధ్యాయులు చిలుకు కృష్ణారావు అన్నారు. ఓజోన్ దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన ఓ త్రి ఆకారం ఆకట్టుకుంది. కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు తులసీప్రసాద్, వై.నాగేశ్వరరావు, బెందాళం రత్నం, గోవిందరాజు, ప్రియదర్శిని, త్రినాథరావు పాల్గొన్నారు.

పలాస : ఓజోన్ పొర సంరక్షించుకునేందుకు కృషి చేయాలని గ్రీన్‌ఆర్మీ అధ్యక్షుడు బోనెల గోపాల్ అన్నారు. మండలంలోని చిన్నబడాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఓజోన్ పొరపై అవగాహన, ప్లాస్టిక్ వినియోగం నష్టం, పచ్చదనం లాభాలపై నాటికలు ప్రదర్శించి అనంతరం మొక్కలు పంపిణీ చేశారు. విద్యార్థులంతా ఓ 3 ఆకారంలో కూర్చొని ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సిహెచ్.ఉషారాణి, ఉపాధ్యాయులు జి.జగదీశ్వరరావు, బి.షణ్ముఖరావు, మన్మథరావు, గోవిందరావు, నగేష్, విజయలక్ష్మి, దుర్గారావు పాల్గొన్నారు.

సోంపేట : ఓజోన్ దినోత్సవం సందర్భంగా సంస్కార భారతి విద్యాసంస్థల ప్రాంగణంలో సంస్కార భారతి డిగ్రీ విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ చిత్రలేఖన పోటీలు ఆల్బమ్స్‌గా ప్రదర్శించారు. తోటి విద్యార్థులు ప్రదర్శించి ఓటింగ్ ద్వారా విజేతలను ఎంపిక చేశారు. కార్యక్రమంలో సెక్రెటరీ కరస్పాండెంట్ డాక్టర్ నిమ్మాన దాసు, చైర్మన్ వై.దేవరాజు, ప్రిన్సిపాళ్లు బి.శ్రీరాంమూర్తి, బి.కవిబాబు, ఎఒ పాపారావు పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు.

యూరియా కోసం రగడ

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

మండలంలో రైతన్నలకు యూరియా లేక తీవ్ర అవస్థలు పడుతున్నారని ఎంపిటిసి వ్యవసాయ అధికారిని నిలదీశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి ఆట్ల సరోజినమ్మ అధ్యక్షత మంగళవారం మండల సమావేశం నిర్వహించారు. యూరియా అందకపోవడంతో రైతులందరూ లబోదిబోమంటున్నారని సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఎఒ ఎన్.శ్రీనివాసరావు మాట్లాడుతూ మండలానికి 1132 మెట్రిక్ టన్నులు యూరియా వచ్చిందని, రైతు సేవ కేంద్రాలకు 476, ప్రైవేట్ డీలర్లకు 646 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందని తెలిపారు. దీనిపై సభ్యులందరూ వ్యవసాయ అధికారులు నిలదీశారు. ఎన్ని టన్నులు రైతు సేవా కేంద్రాల ద్వారా పంపిణీ చేశారు, ప్రైవేట్ డీలర్లకు ఎంత ఇచ్చారు, ప్రైవేటు డీలర్లతో ఎవరికొన్నారనేది వివరాలు తెలపాలని అడిగారు. టిడిపి కార్యకర్త ఇంట్లో 40 బస్తాలు యూరియా ఎలా ఉందని వైసిపి సభ్యులు నిలదీశారు. జెడ్‌పిటిసి దువ్వాడ వాణి మాట్లాడుతూ ముఖ్యమంత్రి, మంత్రులు యూరియా కొదవలేదని చెప్తూ... రైతులకు వెన్నుముక విరిశారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు మాటలు వెనక్కి తీసుకోవాలని సభ్యులు

నిలదీస్తున్న సభ్యులు

డిమాండ్ చేశారు. లింగావలస పిహెచ్ డాక్టర్ భాగ్యశ్రీ మాట్లాడుతూ ఈనెల 18 నుంచి వచ్చే 5 వరకు మహిళలకు ఉచిత మెడికల్ క్యాంపులో నివసిస్తున్నట్లు తెలిపారు. ఈ మెడికల్ క్యాంపులో మహిళలకు అన్ని రకాల రక్త పరీక్షలు ఉచితంగా చేస్తామన్నారు. వర్షాకాలం కావడంతో వ్యాధులకు నిలయంగా మారకుండా గ్రామాల్లో పారిశుధ్య పనులు మెరుగుపరచాలని కార్యదర్శులకు ఎంపిడిఒ ఫణీంద్రకుమార్ సూచించారు. మవోయిస్టు కీర్తిశేషులు నంబాల కేశవరావు స్థూపానికి నిర్మాణానికి సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశంలో పేదాడ రమేష్, ఎంపిటిసిలు సత్తారు ఉషారాణి, కూన పార్వతి, వాకాడ శ్రీధర్‌రెడ్డి, సర్పంచ్‌లు గురువెల్లి బాలకృష్ణ, బగాది హరి, మండల ఇంజినీర్ ఎల్.నాయడు, ఎంపిడిఒ బగాది ప్రసాదరావు, ఎపిఎం ఉమారాణి, ఎంఇఒ దల్లి తులసీరెడ్డి పాల్గొన్నారు.

22న 'చలో విజయవాడ'

ప్రజాశక్తి- మెళియాపుట్టి

నూతన కౌలు చట్టం తీసుకురావాలని, అన్నదాత సుఖీభవ పథకం ద్వారా కౌలు రైతులకు రూ.20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ... ఈ నెల 22న నిర్వహించనున్న చలో విజయవాడ అసెంబ్లీ ర్యాలీని విజయవంతం చేయాలని కౌలు రైతులకు జిల్లా కౌలు రైతు సంఘం కార్యదర్శి పోలాకి ప్రసాదరావు పిలుపునిచ్చారు. మండలంలోని పెద్దలక్ష్మీపురంలో మంగళవారం పోస్టర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కౌలు రైతులకు ప్రభుత్వం ఎలాంటి న్యాయం చేయడం లేదన్నారు. ప్రభుత్వం తక్షణమే నూతన కౌలు చట్టాన్ని తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.సూరయ్య, భోగేష్, బాబూరావు, రాజారావు, బాలయ్య, దివాకర్, రాము, జోగారావు పాల్గొన్నారు.

పోస్టర్లను పంపిణీ చేస్తున్న ప్రసాదరావు

క్రైమ్ కార్నర్

నిందితులను అరెస్టు చేసిన సిఐ సూర్యనారాయణ

గంజాయితో ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి- పలాస

ఒడిశా రాష్ట్రం రాయఘడ నుంచి కర్ణాటక రాష్ట్రానికి తరలిస్తున్న 16 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకొని ఇద్దరు నిందితులను అరెస్టు చేశామని కాశీబుగ్గ సిఐ సూర్యనారాయణ తెలిపారు. కాశీబుగ్గ పోలీసుస్టేషన్‌లో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. రాయఘడ జిల్లా జగిడిపదార్‌కు చెందిన హేమంత్ సాబార్, కిసబ్ సాబార్‌లు కర్ణాటక రాష్ట్రంలోని ఒక వ్యక్తికి గంజాయిని విక్రయించేందుకు ఒప్పందం కుదురుకున్నారని అన్నారు. ఈ ఒప్పందం మేరకు 36 కిలోల గంజాయి మూడు ప్యాకెట్లలో పలాస రైల్వే స్టేషన్ వచ్చారని అన్నారు. వారిని పరిశీలించగా గంజాయి పట్టుబడిందన్నారు. గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బాలుడు అదృశ్యం

ప్రజాశక్తి- పలాస

సందీప్

పలాస - కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని శివాజినగర్‌కు చెందిన ఏడో తరగతి చదువుతున్న గజపతి సందీప్ అదృశ్యమయ్యాడని బాలుడు మేనత్త కొర్రాయి సుజాత మంగళవారం ఫిర్యాదు చేశారని కాశీబుగ్గ సిఐ సూర్యనారాయణ తెలిపారు. సుజాత టైలరింగ్ చేసుకుంటూ తన భర్తతో కలిసి శివాజీనగర్ లో నివాసం ఉంటున్నారు. తన భర్త సోదరికి ఒడిశా రాష్ట్రం బంతి సిరిపూర్‌కు చెందిన వ్యక్తికి ఇచ్చి వివాహం చేశారని, ఆయన అనారోగ్యంతో మృతి చెందారని అన్నారు. వారి ఇద్దరి పిల్లలు సుజాత వద్ద ఉంటూ చదుకుంటున్నట్టు తెలిపారు. గజపతి సందీప్ కాశీబుగ్గ జెడ్‌పిహెచ్ స్కూల్‌లో ఏడో తరగతి చదువతున్నాడని అన్నారు. స్కూల్‌కు సక్రమంగా వెళ్లకపోవడంతో సందీప్‌ను ఇటీవల సుజాత మందలించిందన్నారు. దీంతో ఈ నెల 14న బట్టలు సర్దుకొని ఇంటి నుంచి వెళ్లిపోయాడని ఫిర్యాదు చేసిందన్నారు. ఆ సమయంలో బాలుడు నీలం రంగు ప్యాంట్, ఎరుపు రంగు టీ షర్టు ధరించి ఉన్నాడని తెలిపారు. సందీప్ అదృశ్యంపై కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

ఇద్దరికి ఏడాది జైలుశిక్ష

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ఒకటో పట్టణం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆరు నెలల క్రితం బైక్ చోరీ కేసులో ఇద్దరికి ఏడాది జైలు శిక్ష పడిందని ఎస్ఐ ఎం.హరికృష్ణ మంగళవారం తెలిపారు. మరసింగి అఖిల్, దువ్వు భానుప్రసాద్‌లు బైక్ చోరీలకు పాల్పడడంతో కేసు నమోదు చేశామన్నారు. ఈ కేసు కేసు విచారణకు రాగా, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి తీర్పును వెల్లడించారని అన్నారు. నేరం రుజువు కావడంతో వారికి ఏడాది సాధారణ జైలు శిక్ష విధించారని తెలిపారు. ఉన్నత న్యాయస్థానానికి ఆపిల్ చేసుకునే అవకాశం కల్పించారని తెలిపారు.

పోరాటాలతోనే హక్కుల సాధన

మాట్లాడుతున్న అమ్మన్నాయుడు

హిరమండలం: పోరాటాలతోనే హక్కులను సాధించగలమని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు అన్నారు. ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ కొత్తూరు ప్రాజెక్టు మహాసభను మంగళవారం హిరమండలంలో నిర్వహించారు. ఈ మహాసభలో అంగన్వాడీలు సమ్మె సందర్భంగా సాధించుకున్న జిఒలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలన్నారు. అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పనిభారాన్ని తగ్గించాలన్నారు. యాప్‌ల భారం పెంచడం వల్ల ప్రీస్కూల్‌కు ఇబ్బంది అవుతుందని తెలిపారు. సెంటరు నిర్వహణకు నాణ్యమైన 5జి నెట్‌తో ట్యాబులు ఇవ్వాలన్నారు. గ్రాట్యూటీ జిఒలో మార్పులు చేయాలన్నారు. పోరాటాలు ద్వారానే మినీ అంగన్వాడీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చారన్నారు. మహాసభలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాద్ పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

ఈ మహసభలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ప్రాజెక్టు కమిటీ గౌరవాధ్యక్షునిగా ఆర్.పద్మరాణి, అధ్యక్షునిగా కె.లక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా కె.వి.హేమలత, ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శులుగా ఎం.సుదీషణ, ఆర్.అరుణ, ఎస్.నీరజ, జి.నిర్మల, పి.లక్ష్మి, పి.శశివర్ణ 25 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు.

ఎంఇఒల తీరుపై కలెక్టర్‌కు ఫిర్యాదు

ఎమ్మెల్యే రవికుమార్

మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

ప్రజాశక్తి- బూర్జ

మండల ఎంఇఒల తీరుపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని ఎమ్మెల్యే కూన రవికుమార్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి కర్నెన దీప అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన మండల సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మండలంలోని అల్లిన పాఠశాలలో ఎంఇఒల అవగాహనా రాహిత్యం, నిర్లక్ష్యం కారణంగా స్వల్ప వివాదాలు చోటుచేసుకున్నాయని అన్నారు. గ్రామంలో 6,7, 8 తరగతుల్లో సుమారు 30 మంది విద్యార్థులు ఉన్నారని, 14 కిలోమీటర్ల దూరంలో ఉన్న పాలవలసకు ఎలా పంపిస్తారని ప్రశ్నించారు. ఎంఇఒల తీరుతో గ్రామంలో రాజకీయ మనస్పర్థలు చోటు చేసుకున్నాయని అన్నారు. ఇద్దరు ఎంఇఒలూ బదిలీపై వైఎస్ఆర్ జిల్లాకు వెళ్లిపోవాలని సూచించారు. అల్లినలో ప్రాథమికోన్నత పాఠశాలను యథావిధిగా కొనసాగుతుందని తెలిపారు. అనంతరం గర్భిణులకు 12 వారాల్లో అబార్షన్లు ఎందుకు అవుతున్నాయని గుత్తావల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని ఎమ్మెల్యే ప్రశ్నించారు. పలు ఆరోగ్య కారణాలు వల్ల సమస్య తలెత్తుతుందని వైద్యాధికారి తెలిపారు. ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు 253 డయేరియా కేసులు నమోదయ్యాయని ఎమ్మెల్యే ప్రశ్నించారు. పారిశుధ్యం లోపం కారణంగా వ్యాధుల ప్రబలుతున్నాయని వైద్యాధికారి వివరించారు. దీనిపై ఎంపిడిఒ, ఇఒపిఆర్‌డికు గ్రామాల్లో పారిశుధ్య మెరుగుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే డంపింగ్ యార్డులను ఏర్పాటు చేయాలన్నారు. మండలంలో రైతులందరికీ అవసరమైన ఎరువులను సకాలంలో అందించేందుకు వ్యవసాయశాఖ అధికారులు కృషి చేయాలన్నారు. ఎక్కడైనా బ్లాక్ మార్కెట్‌కు యూరియా తరలిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. మండలంలో రాజకీయాలు చేయొద్దని, ఉద్యోగం మాత్రమే చేయాలని పంచాయతీరాజ్ జెఇ మణికుమార్‌ను హెచ్చరించారు. మూడు నెలలుగా ఇంజినీరింగ్ సిబ్బందికి పనులు లేవని, వారికి జీతాలు ఎలా చెల్లిస్తున్నారని ఎంపిడిఒను ప్రశ్నించారు. సొసైటీ పనితీరుపై చర్చించారు. దీనిపై సిబ్బంది వివరణ ఇస్తూ పిఎసిఎస్ పరిధిలో 6232 మంది రైతులు ఉన్నారని తెలిపారు. అందులో 2500 మంది రైతుల నుంచి రూ.9 కోట్లు బకాయిలు ఉండిపోయాయని తెలిపారు. ఈ మండలంలో మరో రెండు సొసైటీలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని సిఇఒ తెలిపారు. మండలంలోని విద్యుత్ సమస్య తీవ్రంగా ఉందని ఎంపిటిసి ఇప్పిలి సిమ్మయ్య తెలిపారు. సిబ్బంది అందుబాటులో ఉండడం లేదని సభ దృష్టికి తీసుకెళ్లారు. సమావేశంలో వైస్ ఎంపిపిలు బుడుమూరు సూర్యారావు, కరణం కృష్ణంనాయుడు, మార్కెట్ డైరెక్టర్ అనెపు రామకృష్ణ నాయుడు, ఎంపిడిఒ తిరుపతిరావు, తహశీల్దార్ వై.వి.పద్మావతి, ఎఒ డి.ఉషారాణి పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష అధికారుల సమీక్ష

ప్రజాశక్తి- కవిటి

మండల విద్యాశాఖ కార్యాలయాన్ని సమగ్ర శిక్ష కో-ఆర్డినేటర్ బి.గోవిందరావు, ప్రత్యామ్నాయ పాఠశాలల కోఆర్డినేటర్ కె.రామకృష్ణ, జిసిడిఒ డి.రమాదేవి మంగళవారం సందర్శించారు. మండల విద్యాధికారులు ధనుంజయ మజ్జి, సనపల రామకృష్ణతో సమీక్షించారు. సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర ఆటంటికేషన్ పూర్తి చేయాలని సూచించారు. స్వచ్ఛ, హరిత విద్యాలయ రేటింగ్ కోసం ప్రతి పాఠశాల రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. ఈ నెల 19న నియోజకవర్గ స్థాయి కార్యక్రమంలో

సమీక్షిస్తున్న అధికారులు

ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న వికలాంగ విద్యార్థులకు ఉపకరణాల పంపిణీ చేస్తున్నామని, దీని కోసం అర్హులను గుర్తించాలని సూచించారు.

న్యాయం చేయాలి

ప్రజాశక్తి- లావేరు

దీక్ష చేస్తున్న మంగమ్మ

తన భర్త నన్ను విడిచిపెట్టి ఎక్కడకో వెళ్లిపోయాడని, తన న్యాయం చేయాలని మంగమ్మ కోరింది. ఈ మేరకు సిగిరుకొత్తపల్లిలో భర్త ఇంటి ముందు భార్య తన కుమారిడితో కలిసి నిరాహారదీక్ష చేసింది. వివరాలు ఇలా ఉన్నాయి. సిగిరుకొత్తపల్లికి చెందిన ఎర్ర శంకరరావు, మంగమ్మ వేర్వేరు తరగతులకు చెందిన వారు. ఇద్దరూ ప్రేమించుకొని 2021లో హైదరాబాద్‌లోని ఓ ఆలయంలో వివాహం చేసుకున్నారు. వీరికి ఆరేళ్ల కుమారుడు ఉన్నారు. గతంలో శంకరరావు భార్యకు చెప్పకుండా ఇంట్లో వెళ్లిపోయారు. దీనిపై లావేరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు గాలించి శంకరరావును తెప్పించి ఇద్దరినీ ఒప్పందించారు. అనంతరం పైడిభీమవరంలో ఉన్నారు. ఈ నెల 4న మళ్లీ శంకరరావు మంగమ్మకు చెప్ప కుండా వదిలిపెట్టి ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. పది రోజులుగా భర్త ఆచూకీ లేకపోవడంతో శంకరరావు ఇంటి వద్ద సోమవారం రాత్రి నుంచి దీక్ష చేస్తుంది.

మహిళా చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి- రణస్థలం

మహిళా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జె.ఆర్.పురం ఎస్ఐ ఎస్.చిరంజీవి అన్నారు. మండలంలోని కోష్టలో మహిళా చట్టాలపై మంగళవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శక్తి టీం సభ్యులు మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న నేరాలపై అవగాహన కల్పిస్తూ, ఏదైనా సమస్య వచ్చినప్పుడు వెంటనే పోలీసులను సంప్రదించాలని కోరారు. 100కు డయల్ చేయాలని, ఎవరు కూడా అధైర్య పడవద్దు అని, అందరికీ అండగా పోలీస్ వ్యవస్థ ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు. అనంతరం కోష్టలో డాగ్ స్క్వాడ్‌తో విస్తృతంగా తనిఖీ చేశారు. అన్ని షాపులు, హోటళ్లు, ఇంటి పరిసరాల్లో తనిఖీలు నిర్వహించారు. మాదకద్రవ్యాలు వినిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అవగాహన కల్పిస్తున్న శక్తి టీమ్

శివారు వార్డుల అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యేలు రవికుమార్, శంకర్

ప్రజాశక్తి- ఆమదాలవలస

పురపాలక సంఘంలోని శివారు వార్డుల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, ఆమదాలవలస, శ్రీకాకుళం ఎమ్మెల్యేలు కూన రవికుమార్, గొండు శంకర్ అన్నారు. పురపాలక సంఘం పరిధిలోని 3,4,6,7 వార్డుల్లో రూ. 53 లక్షలతో బిపిఎస్-ఎల్ఆర్ఎస్ నిధులతో నిర్మాణం చేపట్టనున్న సిసి రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలకు, ఆరో వార్డు పరిధిలోని సనపలవానిపేటలో మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పురపాలక సంఘంలోని ప్రతివార్డులోనూమౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా కృషి చేస్తామని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యేలు

పవన్ కళ్యాణ్ రోడ్లు, డ్రైనేజీల అభివృద్ధిపై దృష్టిసారించారని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తమ్మినేని రవి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తమ్మినేని గీతా విద్యాసాగర్, టిడిపి నాయకులు మొదలవలస రమేష్, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జీ పేడాడ రామ్మోహనరావు, రాష్ట్ర మెడికల్ బోర్డు సభ్యులు చాపర సుధాకర్, అన్నెపు భాస్కరరావు, కూన ఆంజనేయులు, బోర గోవిందరావు, నాగళ్ల మురళీధర్ యాదవ్, మాలిక్ ఎస్.మురళీధరరావు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న గిరిబాబు

పలాస : విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు అవసరమని, క్రీడా పోటీలు నిర్వహించడం ద్వారా క్రీడాకారుల్లో ప్రతిభ బయటపడుతుందని పలాస-కాశీబుగ్గ మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు అన్నారు. పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మంగళవారం పాఠశాల క్రీడల సమాఖ్య ఆధ్వర్యాన నిర్వహించిన డివిజన్ స్థాయి క్రీడా ఎంపికలను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. క్రీడల కోటాలో ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయని చెప్పారు. అనంతరం బ్యాడ్మింటన్, ఖోఖో, వాలీబాల్ అంశాల్లో క్రీడాకారులు జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. కార్యక్రమంలో జోగ మల్లేశ్వరరావు, డొక్కరి శంకరరావు, కొరికాన శంకరరావు, టి.రవిశంకర్ గుప్తా, పాఠశాల ఇన్‌ఛార్జీ ప్రధానోపాధ్యాయులు ఆర్.రాజ్యలక్ష్మి, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ తారక్, డివిజన్ స్థాయి కో-ఆర్డినేటర్ పి.తవిటయ్య, రాష్ట్ర అథ్లెటిక్స్ టెక్నికల్ కమిటీ చైర్మన్ కె.హరిబాబు, జిల్లా టెన్నీకాయిట్ సంఘం అధ్యక్షుడు, కార్యదర్శి మల్లా సంతోష్ కుమార్, ఎస్.వి.జోగారావు పాల్గొన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు సిహెచ్.పద్మలోచనం, కె.పి.రెడ్డి, పి.గజేంద్ర, ఎస్.రామారావు, ఎస్.చంద్రశేఖర్, బి.శంకరరావు, ఆర్.శ్రీనివాసరావు, జి.లోకేష్ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.

నిబద్ధతతో పనిచేయాలి

శ్రీకాకుళం రూరల్ : టిడిపి కార్యకర్తలు నిబద్ధతతో పనిచేయాలని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. విశాఖ-ఎ కాలనీలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో టిడిపి కార్యకర్తలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందేలా కృషి చేయాలన్నారు. ప్రజలతో నిరంతరం అందుబాటులో ఉండాలన్నారు.

డ్వాక్రా లింకేజీలు వేగవంతం

శ్రీకాకుళం రూరల్ : మండలంలోని డ్వాక్రా గ్రూపు మహిళలకు లింకేజీలు వేగవంతం చేసి రుణాలు అందేలా చేయాలని ఎపిఎం కె.రజని అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలోని మండల మహిళా సమైక్య సమావేశ మందిరంలో విఒఎలకు మంగళవారం స్కానర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐకెపి ద్వారా డ్వాక్రా గ్రూపులకు అన్ని రకాల సేవలను పూర్తిస్థాయిలో అందించాలన్నారు. గతం కంటే డ్వాక్రా గ్రూపులకు రుణాలు ఎక్కువ మొత్తంలో అందజేస్తున్నమని, తద్వారా మహిళలు వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు. రుణాలు పొంది వ్యాపారాలు చేయడం ద్వారా మహిళలు ఆర్థికంగా ఎదుగుతారని తెలిపారు. విఒఎలు డ్వాక్రా గ్రూప్ సభ్యులతో సమావేశాలు నిర్వహించి ఐకెపి ద్వారా అమలు చేస్తున్న సేవలను వివరించాలన్నారు. కార్యక్రమంలో సిసిలు ఎం.లక్ష్మణ్, జి.సత్యవతి, జి.రాజారత్నం, ఎన్.సీతారాముడు, మండల సమాఖ్య సంఘం కోశాధికారి ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

స్కానర్లను అందజేస్తున్న ఎపిఎం రజని

మాట్లాడుతున్న వైద్యాధికారి ప్రసన్నకుమార్

ప్రైవేట్ క్లినిక్‌లు తనిఖీ

కొత్తూరు: పార్వతీపురం మన్యం జిల్లా భామిని మండలం ఘనసరకు చెందిన కిల్లరి తేజాలుకు కొత్తూరులోని శ్రీసాయి ప్రజా వైద్యశాలలో ఆర్‌ఎంపి వైద్యులు వై.నాగేశ్వరరావు వైద్యం అందిస్తూ... అది వికటించి ఇటీవల మృతి చెందారు. దీనిపై డిఎంహెచ్ఒ అనిత ఆదేశాల మేరకు పాలకొండ రోడ్డులోని గాయత్రి, బత్తిలి రోడ్డులోని వెంకటేశ్వర ప్రైవేటు క్లీనిక్‌లను కురిగాం పిహెచ్‌సి ప్రధాన వైద్యులు పెద్దిన ప్రసన్నకుమార్‌లు మంగళవారం తనిఖీ చేశారు. ఆర్‌ఎంపి వైద్యులు ప్రాథమిక వైద్యం మాత్రమే చేయాలని సూచించారు. ప్రభుత్వం నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈయన వెంట ఎఒ బుచ్చిబాబు ఉన్నారు.

సమీక్షిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

అభివృద్ధి లక్ష్యంతో పనిచేయాలి

ఎమ్మెల్యే గొండు శంకర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

అధికారులు అభివృద్ధి లక్ష్యంతో విధులు నిర్వహించి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగర పాలక సంస్థ కార్యాలయంలో ఇంజినీరింగ్, మున్సిపల్, రెవెన్యూ విభాగం అధికారులతో మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శానిటేషన్ విషయంలో ఎక్కడా రాజీలేకుండా పనులు చేయాలన్నారు. వర్షాలు కురుస్తున్న దృష్ట్యా రోగాల ప్రబలే అవకాశం ఉందని, కాలువల్లో మురుగు లేకుండా చూసి బ్లీచింగ్ చేయాలని సూచించారు. ముఖ్యంగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు సకాలంలో ప్రజలకు అందుతున్నాయో? లేదో? చూడాలన్నారు. ప్రజల సమస్యలపై సకాలంలో స్పందించాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ ప్రసాద్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సూర్యచంద్రరావు

హిందీ భాషకు ప్రాధాన్యం అవసరం

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

జాతీయ భాష హిందీకి ప్రాధాన్యత అవసరమని శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు అన్నారు. ప్రభుత్వ మహిళా కళాశాలలో హిందీ విభాగం విభాగాధిపతి పి.పార్వతి ఆధ్వర్యాన మంగళవారం హిందీ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హిందీ భాష నేర్చుకోవడం వల్ల భారతదేశంలోని ఏ ప్రాంతానికైనా ధైర్యంగా వెళ్లి రావచ్చునని అన్నారు. ముఖ్య అతిథి విశ్రాంత ప్రిన్సిపాల్ విశ్వేశ్వరవర్మ భూపతి రాజు మాట్లాడుతూ హిందీ భాషని రాష్ట్ర భాషగా, రాజభాషగా ఎన్నుకోవడం వెనుక గల కారణాలు వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.చిన్నారావు, అకాడమిక్ కో-ఆర్డినేటర్ కె.మౌనిక ఐక్యూఎసి కో-ఆర్డినేటర్ ఎస్.పద్మావతి, సిఓఇ టి.ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

మహిళలకు అవగాహన కల్పించాలి

టెక్కలి : ఆరోగ్యవంతమైన, మహిళా శక్తివంతమైన కుటుంబానికి బలమైన పునాది అనే నినాదంతో నిర్వహించనున్న పోషణ మాసోత్సవాలపై గ్రామాల్లోని గర్భిణులకు, బాలింతలకు, మహిళలకు అవగాహన కల్పించాలని ఐసిడిఎస్ పిఒ ఎస్.విద్య అన్నారు. టెక్కలి ఐసిడిఎస్ కార్యాలయంలో టెక్కలి, నందిగాం మండలాల అంగన్వాడీ సిబ్బందితో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 17 నుంచి ప్రారంభం కానున్న ఈ మాసోత్సవాలపై ప్రభుత్వం విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పురుషుల భాగస్వామ్యాన్ని కూడా తీసుకోవాలని కోరారు. స్థానికంగా లభించే ఆహార పదార్థాలపై అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో విద్యా శతపతి, సంధ్య, సరస్వతి, శారద, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బాలాజీ

మధ్యంతర భృతి ప్రకటించాలి

ప్రజాశక్తి- రణస్థలం

2023 జూలై నుంచి అమలు కావాల్సిన 12వ పిఆర్‌సి కమిటీని ఇంతవరకు నియమించకపోవడంతో ఉద్యోగులు రెండేళ్లుగా నష్టపోతున్నామని ఆపస్ రాష్ట్ర అధ్యక్షులు శవన్నగారి బాలాజీ ప్రభుత్వానికి కోరారు. సభ్యత్వ నమోదులో భాగంగా మండలంలోని వివిధ పాఠశాలలను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దసరా కానుకగా 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలన్నారు. పూర్వ జిల్లా అధ్యక్షులు జి.వెంకటగిరి మాట్లాడుతూ కాంప్లెక్స్ స్థానాల్లో పనిచేస్తున్న గణిత, ఆంగ్ల ఉపాధ్యాయులకు శాశ్వత స్థానాలు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రవి భట్లు, మండల అధ్యక్షులు జి.చిన్నికృష్ణంనాయుడు, మండల ప్రధాన కార్యదర్శి రాజు పాల్గొన్నారు.

ఘనంగా క్షౌరవృత్తిదారుల దినోత్సవం

కోటబొమ్మాళి : కోటబొమ్మాళిలో నాయీబ్రహ్మణుల కమ్యూనిటీ హాల్‌లో మండల నాయీబ్రహ్మణుల ప్రపంచ క్షౌరవృత్తిదారుల దినోత్సవం మంగళవారం నిర్వహించారు. జిల్లా నాయీబ్రాహ్మణ సంఘం ఉపాధ్యక్షుడు నౌగాపు నాగరాజు మహాత్మా జ్యోతిరావు పూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం స్వీట్స్, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చిగురువలస కనకరాజు, రామారావు, వీరాస్వామి, తెలగవలస మోహనరావు, వెంకటేష్, సుశీల, లక్ష్మి, రాజేశ్వరి, రవణమ్మ పాల్గొన్నారు.

చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న నాగరాజు

ఇంటింటికీ తాగునీటి కుళాయిలు

ఎమ్మెల్యే కూన రవికుమార్

ప్రజాశక్తి- బూర్జ

థర్మల్ పవర్ ప్లాంట్ ఏర్పాటుతో ఈ ప్రాంతం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. ఈ మేరకు బూర్జలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. పవర్ ప్లాంట్ ఏర్పాటుతో ఈ ప్రాంతంలోని యువతకు ఉద్యోగ అవకాశాలు కలుగుతాయని అన్నారు. మండలంలో సిమెంట్ ఫ్యాక్టరీ నెలకొల్పేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అలాగే నారాయణపురం నుంచి మండలంలోని అన్ని గ్రామాల్లోనూ ఇంటింటికీ తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వైసిపి ప్రభుత్వంలో మొండిబకాయిగా ఉన్న 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.71.94 లక్షలు విడుదలయ్యాయని అన్నారు. ఈ నిధులతో గ్రామాల్లో వీధిలైట్లు ఏర్పాటు, రోడ్లు, కాలువలు నిర్మిస్తామన్నారు. ప్రజల సహకారంతో మరింత ముందుకు వెళ్తామని తెలిపారు.

నియామకపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

నియామకపత్రం అందజేత

బూర్జ : మండలంలోని నీలాదేవిపురం ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌గా కర్రి దివ్యను ఎమ్మెల్యే రవికుమార్ నియమించారు. ఇందుకు సంబంధించి మంగళవారం దివ్యకు నియామక పత్రాన్ని అందజేశారు.

న్యాయ విజ్ఞానం అవసరం

జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

ప్రజాశక్తి - శ్రీకాకుళం లీగల్

ప్రజల్లో న్యాయ విజ్ఞానం విస్తరించేలా పారాలీగల్ వాలంటీర్లు చురుగ్గా కృషి చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జునైద్ అహ్మద్ మౌలానా సూచించారు. చట్టాలపై అవగాహన కల్పించి, న్యాయం అందరికీ చేరేలా పనిచేయాలన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా న్యాయ సేవా సదన్‌లో ఎంపికైన పారాలీగల్ వాలంటీర్లకు మంగళవారం ఒకరోజు వృత్యంతర శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయ నిపుణులు భారత రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులు, విధులు, నల్సా (జాతీయ న్యాయ సేవా సంస్థ) ప్రజలకు అందించే పథకాలు, పారాలీగల్ వాలంటీర్ల చేయాల్సినవి, చేయకూడనివి వంటి అంశాలపై విపులంగా వివరించారు. పారాలీగల్ వాలంటీర్లు క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ న్యాయపరమైన సమస్యలకు పరిష్కారం చూపాలన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి హరిబాబు, న్యాయవాదులు అన్నెపు భువనేశ్వరరావు, జి.ఇందిరాప్రసాద్, కె.ఆఫీసు నాయుడు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

ఉపకార వేతనాలను అందజేస్తున్న డిఇఒ రవిబాబు

బాలికలకు భరోసా

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ప్రతిభ ఉన్న పేద, అనాథ ఆడపిల్లల భవిష్యత్‌కు వసుధైక కుటుంబం ఫౌండేషన్ భరోసాగా నిలవడంపై డిఇఒ ఎ.రవిబాబు ప్రశంసించారు. ఆర్ట్స్ కాలేజీ రోడ్డులోని స్కౌట్స్ అండ్ గైడ్స్ సెమి నార్ హాల్‌లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా 55 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, సైకిళ్లు ఉచితంగా పంపిణీ చేశారు. 2022 నుంచి ఉత్తరాంధ్ర జిల్లాల్లో మొత్తం 500 సైకిళ్లు, వాటిలో శ్రీకాకుళం జిల్లాలోనే 150 సైకిళ్లు అందజేశామని వసుధైక కుటుంబం జిల్లా సమన్వయకర్త పూజారి హరిప్రసన్న తెలిపారు. కెనరా బ్యాంక్ సౌజన్యంతో ఈసారి 25 సైకిళ్లు, 32 మందికి నెలకు రూ.వెయ్యి స్కాలర్‌షిప్‌లు అందిస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో ఉపవిద్యాశాఖాధికారులు ఆర్.విజయకుమారి, పి.విలియమ్స్, డిసిసిబి సెక్రటరీ సంజీవరావు, పాల్గొన్నారు.

వినతులు స్వీకరిస్తున్న ఎంపీ అప్పలనాయుడు

రణస్థలంలో ఎంపీ గ్రీవెన్స్

రణస్థలం: విజయనగరం పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు మంగళవారం రణస్థలం ఎంపీ క్యాంపు కార్యాలయంలో పబ్లిక్ గ్రీవెన్స్ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వినతులు స్వీకరించి సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిస్కారానికి కృషి చేశారు. ఆనంతరం మెగా డిఎస్‌సిలో ప్రతిభ కనబరిచి జోన్-1లో టాపర్‌గా నిలిచిన మండలంలోని పాతర్లపల్లికి చెందిన గొర్లె అప్పలనాయుడుని అభినందించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గొర్లె సాయి దీప్ తదితర నాయకులు పాల్గొన్నారు.

నేతాజీ ఎంపికపై హర్షం

పలాస : బహుజనుల హక్కుల రక్షణకు, సంక్షేమానికి ఎంఆర్‌పిఎస్ నేతృత్వంలో పోరాడుతున్న బహుజన ఉద్యమానికి జిల్లా సోషల్ మీడియా ఇనన్‌ఛార్జిగా చెరుకుపల్లి నేతాజీ ఎంపికయ్యారు. ఈయన ఎంపికపై పలువురు మంగళవారం హర్షం వ్యక్తం చేశారు. మంద కృష్ణమాదిగ ఆదేశాల మేరకు జిల్లా సోషల్ మీడియా ఇన్‌ఛార్జిగా నియమితులయ్యారు. ఈయనకు జగదీష్, దనేశ్వర మహారణ, కొంచాడ రవిశంకర్, ఉర్నాన అప్పలరాజు హర్షం వ్యక్తం చేసిన వారిలో ఉన్నారు.

పశువులకు టీకాలు

మందస: మండలంలోని కొంకడాపుట్టి పంచాయతీ సందిగాంలో మందస పశువైద్యాధికారి దువ్వాడ శ్రీకాంత్ ఆధ్వర్యాన మంగళవారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పశు వ్యాధులపై పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మంగళపాత్రో, మాలతి మురళి, దర్మేంద్ర, రవి, పురుషత్తం పాల్గొన్నారు.

టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది

బ్యాంకు పథకాలపై అవగాహన

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

బ్యాంకులో పొదుపు ఖాతా దారులందరూ ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన, సురక్ష బీమా యోజన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని విశాఖ గ్రామీణ బ్యాంకు బ్రాంచ్ మేనేజర్ షేక్ అజ్మత్ అన్నారు. మండలంలోని చిన్నహరిశ్చంద్రపురంలో జర్జంగి ఎపిజివిబి ఆధ్వర్యాన మంగళవారం ఆర్థిక అక్షరాస్యత అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకులో అతి తక్కువ వడ్డీతో బంగారం, వ్యవసాయ రుణాలు అందజేస్తామన్నారు. సైబర్ నేరగాళ్లపై అప్రమత్తంగా ఉండాలన్నారు. అపరిచిత వ్యక్తులకు బ్యాంకు అకౌంట్ వివరాలు ఇవ్వకూడదన్నారు. ఎటిఎంల వద్ద అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది బి.దుర్గాప్రశాంత్, పార్వతీశ్వరరావు, ఐ.వరప్రసాద్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బ్యాంకు మేనేజర్ జీవన జ్యోతి

విధ్వంసకర అభివృద్ధిని వ్యతిరేకించాలి

టెక్కలి: జిల్లాలో విధ్వంసకర అభివృద్ధిని ప్రతిఒక్కరూ వ్యతికించాలని, ప్రజా పోరాటాలకు అండగా నిలవాలని ప్రజాసంఘాల ఐక్యవేదిక జిల్లా కార్యవర్గ సభ్యులు పేడాడ కృష్ణారావు కోరారు. మంగళవారం టెక్కలిలో విలేకరులతో మాట్లాడారు. పలాస నియోజకవర్గంలో మందస, వజ్రపుకొత్తూరు మండలాల్లో కార్గో ఎయిర్‌పోర్టు నిర్మాణం, సరుబుజ్జిలి మండలం వెన్నెలవలస వద్ద విధ్వంసకర థర్మల్ విద్యుత్ ప్రాజెక్టులు నిర్మాణానికి కూటమి ప్రభుత్వం సిద్ధపడుతుం దన్నారు. ఈ రెండు విధ్వంసకర అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం స్వార్థ ప్రయోజనాలే తప్ప ప్రజా సంక్షేమం కోసం కాదన్నారు. ప్రజల జీవనోపాధిని ధ్వంసం చేసే అభివృద్ధి ఎలా అవుతుందని ప్రశ్నించారు వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు స్థాపించి వ్యవసాయ రంగాన్ని పారిశ్రామిక రంగాన్ని అభివృది చేయాలన్నారు. ఆమదాలవలసలోని మూతబడిన సుగర్ ఫ్యాక్టరీ తెరిపించాలన్నారు. జూట్ పరిశ్రమ, కొబ్బరి పీచు పరిశ్రమ, ఉప్పు తయారీ, నూనె మిల్లులు వంటి పరిశ్రమలకు అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రజా సంక్షేమానికి ఆలోచించాలని కోరారు.

నిర్వాసితుల త్యాగాలు మరువలేనివి

మాట్లాడుతున్న బాబూరావు

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గ రైల్వే వంతెన నిర్మాణాలకు స్థలాలు ఇచ్చిన నిర్వాసితుల త్యాగాలు మరువలేనిదని ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు అన్నారు. కాశీబుగ్గ సూదికొండ నిర్వాసితులకు కేటాయించిన స్థలంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైల్వే వంతెన కోసం స్థలాలు త్యాగం చేసిన నిర్వాసితులకు పట్టణానికి సమీపంలో ఇళ్ల స్థలాలు కేటాయించామన్నారు. ఈ ప్రాంతంలో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేస్తే ఒక స్మార్ట్ సిటీగా మారుతుందన్నారు. ప్రభుత్వ పరంగా రహదారులు, కాలువలు, విద్యుత్, తాగునీరు వంటి సౌకర్యాలు కల్పిస్తామన్నారు. సమావేశంలో బిసి, సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్.కామేశ్వరరావు, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి గాలి కృష్ణారావు, పట్టణ అధ్యక్షుడు బి.నాగరాజు, కౌన్సిలర్ జి.సూర్యనారాయణ, చంద్రశేఖర త్యాడి, శివ, జగదీష్, ఎ.కృష్ణమూర్తి, ఎం.నరేంద్రచిన్న, పి.చక్రధర్, టి.శంకర్ పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలతో జీవితాలు నాశనం

టెక్కలి రూరల్ : యువత మాదక ద్రవ్యాలకు బానిసలైతే జీవితాలు నాశనమవుతాయని టెక్కలి సిఐ అంబటి విజయకుమార్ తెలిపారు. మండలంలోని లింగాలవలస లో మాదకద్రవ రవాణా, వినియోగంపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు బానిసలై అనారోగ్యానికి గురవుతు న్నారని అన్నారు. సరదాగా మొదలయ్యే ఈ అలవాటు చివరకి బానిసగా మార్చుతుందని అన్నారు. డ్రగ్స్ కోసం నేరాలు చేసేందుకు కూడా వెనుకాడరన్నారు. యువత సన్మార్గాన్ని అలవర్చుకోవాలన్నారు. పోటీ ప్రపంచానికి అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. శ్రద్ధగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలనన్నారు.

అవగాహన కల్పిస్తున్న సిఐ విజయకుమార్

అవగాహన కల్పిస్తున్న మాధవరావు

అవగాహనే రక్షణ

ప్రజాశక్తి- కవిటి

హెచ్‌ఐవి, ఎయిడ్స్ వ్యాధులపై అవగాహనే రక్షణ కల్పిస్తుందని వైసిబి ట్రక్కర్ ప్రాజెక్టు మేనేజర్ మాధవరావు తెలిపారు. మండలంలోని బెలగాం ఆర్‌కె పాఠశాలలో వైసిబి ట్రక్కర్ ప్రాజెక్టు ఆధ్వర్యాన మంగళవారం విద్యార్థులకు హెచ్‌ఐవి, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వ్యాధి వ్యాప్తి మార్గాలు, తప్పుడు అపోహలను నిపుణులు ఖండించారు. మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలు విద్యార్థులను దారితప్పిస్తున్నాయని, వాటికి పూర్తిగా దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గురుమూర్తి, హెల్త్ ఎడ్యుకేటర్ రవికుమార్, ఎఎన్ఎం జయలక్ష్మి పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు

ఎపిటిఎఫ్ నాయకుల ధర్నా

శ్రీకాకుళం సిటీ: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు సిహెచ్.మంజుల డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ వద్ద మంగళవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయుల డిమాడ్లు పరిష్కరించకుంటే భవిష్యత్‌లో ఉద్యమం మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బకాయి పడిన నాలుగు డిఎలు చెల్లించాలన్నారు. సిపిఎస్ రద్దు చేసి, జిఒ 57 అమలు చేయాలని, 12వ పిఆర్‌సి కమిషన్ నియమించాల న్నారు. ఇహెచ్‌ఎస్ పరిధి రూ.25 లక్షలు పెంచాలన్నారు. యాప్‌ల నిర్వహణ, అసెస్‌మెంట్ బుక్ లెట్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.భానుమూర్తి పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కమిషనర్ రమేష్

అర్హులకు పక్కా ఇళ్లు

ఇచ్ఛాపురం: ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 అంగీకార్-25 కింద పట్టణ ప్రాంతాల్లో అర్హులందరికీ పక్కా గృహాలు మంజూరు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్ తెలిపారు. మేరకు కార్యాలయంలో రూపొందించిన అవగాహనా పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇళ్లు లేని పేదలకు వెంటనే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ విషయంపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. పిఎంజెఎవై 1.0 కింద గతేడాది లబ్ధిపొందిన ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాల న్నారు. కార్యక్రమంలో మెప్మా, టిడ్కో సిబ్బంది పాల్గొన్నారు.

బైక్‌ను స్వాధీనం చేసుకున్న ఎస్ఐ శ్రీనివాస్

మండలపల్లిలో కార్డాన్‌సెర్చ్

ఇచ్ఛాపురం : మండలంలో మండపల్లి పంచాయతీలో మంగళవారం రూరల్ ఎస్ఐ శ్రీనివాస్ ఆధ్వర్యాన మంగళవారం పోలీసులు కార్డాన్‌సెర్చ్ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి అనుమానితులు, అక్రమ గంజాయి, ఇతర మాదకద్రవ్యాలు నిల్వలపై తనిఖీలు నిర్వహించారు. సరైన పత్రాలు లేని 16 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలో ఉదయం ఆకస్మికంగా పోలీసులు రావడం గ్రామస్తులు ఆందోళన గురయ్యారు.

కాలువ ఏర్పాటు చేయాలని వినతి

ఇచ్ఛాపురం: మండలంలో ఈదుపురంలో ఉన్న ఒరియా చర్చ వద్ద సరైన కాలువ లేకపోవడం క్రిస్టియన్లు ఇబ్బందులు పడుతున్నారని క్రిస్టియన్ మైనారిటీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రత్తి అన్వేష్ అన్నారు. ఈ మేరకు తహశీల్దార్ వెంకటరావు, ఎంపిడిఒ రామారావులను మంగళవారం వేర్వేరుగా వినతిపత్రాలను అందజేశారు. అధికారులు సాను కూలంగా స్పందించాలని కోరారు. కాపరి భీమో బెహరా, హంగ్రీ బెహరా, పాల్, ఉమాకాంత్, దాస్ పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న అన్వేష్